సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శుక్రవారం 27-6-2025
సంపుటి: 21 సంచిక: 81
పేజీలు: 8 వెల: రూ.1



## దివ్యాంగులకు అన్నివిధాల ఆదుకుంటాం

❖ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి
**కింజరాపు రామ్మోహన్ నాయుడు**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దివ్యాంగులను అన్నివిధాల ఆదుకుంటామని, వారిలో ఉన్న ఆత్మ విశ్వాసానికి సాల్యూట్ చేస్తున్నాని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సన్‌రైజ్ హెూటల్‌లో ఎయిర్‌పోర్ట్ అథారిటి ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సామాజిక బాధ్యత కింద చేపట్టిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ రూ.3.20 కోట్లతో 43 రకాలకు చెందిన 1,230 పరికరాలను 800 మంది దివ్యాంగులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్ట్ అథారిటి ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అలీంకో సంస్థ సహకారంతో వివిధ రకాల కిట్లను పంపిణీ చేస్తున్నట్టు

- మిగతా చివరి పేజీలో

## తప్పుడు సర్టిఫికెట్‌కు సత్కారం!



* గార ఎస్‌బీఐకి ఆడిట్ క్లీన్‌చిట్ ఇచ్చిన కరుణ్‌కుమార్
* ఆ తర్వాతే తాకట్టు నగల కుంభకోణం వెలుగులోకి
* ఆయనిచ్చిన రిపోర్టు తప్పని తేలినా చర్యలు శూన్యం
* పైగా ఆ బ్రాంచికే మేనేజర్‌గా నియామకం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గార ఎస్‌బీఐలో తాకట్టు బంగారం మాయం కేసులో ఆడిటింగ్ నిర్వహించిన ఉద్యోగినే ఇప్పుడు బ్రాంచి మేనేజర్‌గా ఉన్నతాధికారులు బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. గార ఎస్‌బీఐ లాకర్‌లో ఉండాల్సిన బంగారు ఆభరణాలను ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల్లో కుదువపెట్టినా సంబంధిత ఆడిటర్లు మాత్రం బంగారం సేఫ్‌గా ఉందంటూ ప్రతిసారీ క్లీన్‌చిట్ ఇస్తూ వచ్చారు. శ్రీకాకుళం జిల్లాపరిషత్ కార్యాలయం పక్కనున్న ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ కరుణ్‌కుమార్ కూడా 2023లో గార బ్రాంచిలో ఆడిట్ చేసి అంతా సవ్యంగా ఉందని రిపోర్టు ఇచ్చారు. ఆ తర్వాతే ఈ కుంభకోణం బయటపడింది. ఈ వ్యవహారంలో ఆడిటర్ల పాత్రపై విచారణ లో భాగంగా కరుణ్‌కుమార్‌ను కూడా శ్రీకాకుళం పోలీసులు ప్రశ్నించారు. ప్రస్తుతం ఈ కేసును పునర్విచారించాలంటూ ఆత్మహత్య చేసుకున్న బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ స్వప్నప్రియ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, హోంమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించి పూర్వపరాలను పోలీసులు మళ్లీ విచారిస్తున్నారు. ఇటువంటి తరుణంలో అప్పట్లో ఆడిట్ క్లీన్‌చిట్ ఇచ్చినవారిలో ఒకరైన కరుణ్‌కుమార్‌ను అక్కడ బ్రాంచి మేనేజర్‌గా నియమించడం సరికాదని బ్యాంకు వర్గాలే చెబుతున్నాయి.

## ఆధార్ మార్చి.. అందరినీ ఏమార్చి..!



- సొంతదారుకు తెలియకుండా స్థలాన్ని అమ్మేశారు
- అనపర్తికి చెందిన వ్యక్తి ఆధార్ ఇతని పేరుతో ట్యాంపర్
- దాన్ని చూపించి అక్రమంగా స్థలం రిజిస్ట్రేషన్
- విషయం తెలిసి జేసీకి స్థల యజమాని ఫిర్యాదు
- దాంతో కుట్రంతా బట్టబయలు.. కొనసాగుతున్న విచారణ
- అజంతా లే అవుట్‌లో ఇటువంటి వివాదాలు ఎన్నో

“స్థలం యజమాని ఒకరు.. చూపించిన ఆధార్ వేరొకరిది.. ఆధార్‌లో జత చేసిన ఫింగర్ ప్రింట్స్ ఇంకొకరివి.. రిజిస్ట్రేషన్ జరిగింది మరోచోట. ఇన్ని మాయలు చేసి.. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని ఒక స్థలాన్ని అమ్మేసి దాన్ని ఆమదాలవలస సబ్ రిజిస్ట్రార్ కార్యాయంలో రిజిస్టర్ చేయించేశారు. దానికి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఎనీవేర్ రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని వాడేసుకున్నారు. తన స్థలాన్ని కాజేశారని ఆలస్యంగా గుర్తించిన అసలు యజమాని లబోదిబోమంటూ పరిగెత్తుకుంటూ వచ్చి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో భూకబ్జా కాండకు చెందిన డొంకంతా కదిలింది. అంతే జేసీ ఆదేశాలతో ఒక రియల్ ఎస్టేట్ వెంచర్ కార్యకలాపాలపై వేటు పడింది.”

- వివరాలు చివరి పేజీలో



## మాజీ సర్పంచ్ మోహనరావు మృతి

**- పాడె మోసిన గొండు.. నివాళులర్పించిన ధర్మాన -**





(సత్యంన్యూస్, శ్రీకాకుళంరూరల్)

గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న సింగుపురం మాజీ సర్పంచ్ గుండ మోహనరావు (74) గురువారం అర్ధరాత్రి స్వగృహంలోనే తుది శ్వాస విడిచారు. మోహనరావు మృతిచెందిన సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మోహనరావు భౌతికకాయానికి నివాళి అర్పించి సంతాపం

- మిగతా చివరి పేజీలో

Happy BIRTHDAY

జన్మదిన శుభాకాంక్షలు

HAPPY BIRTHDAY

మారుమూల శ్రీకాకుళం జిల్లా అసోసియేషన్ సత్తాను
రాష్ట్రస్థాయిలో చాటి సిక్కోలు గడ్డ
మరెవరికీ తీసిపోదని నిరూపించి
రాష్ట్ర సెక్రటరీగా ఎన్నికై జిల్లాలో ఎంతోమంది
హోటల్స్, బేకర్స్, ఫంక్షన్ హాల్స్ యాజమాన్యాలకు
రాష్ట్రస్థాయిలో స్థానం కల్పించి మాకు గర్వకారణంగా నిలిచిన
శ్రీ మెట్ట నాగరాజు గారికి జన్మదిన శుభాకాంక్షలు



గౌ॥ శ్రీ మెట్ట నాగరాజు గారు, సెక్రటరీ
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్

Hope it will be better in the future

– మీ
వరద ఆశిష్ (వరదా నాగావళి హోటల్)
తుంబలి సుదర్శన్ (హోటల్ గజపతి)
గజరావు వినోద్ కుమార్ (ఎస్.వి.డి.)
ఎ.సతీష్ (7 బిర్యానీ)
పి.శ్రీను (7 బిర్యానీ)
కెల్ల కిశోర్ (చిన్నీ ఫ్లెక్స్)
సువ్వారి సతీష్ (గ్రాండ్)

• ఎడిటోరియల్

# విశాఖ ఉక్కుతో సర్కారు ఆటలు!

దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్లలో ఒకటైన విశాఖ ఉక్కు కర్మాగారంతో కేంద్ర ప్రభుత్వం ప్రయోగాలు చేస్తోందో లేక ఆటలాడుకుంటోందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఫలితంగా గత నాలుగేళ్లుగా ఈ పరిశ్రమ భవిష్యత్తు డోలాయమాన స్థితిలో ఊగిసలాడుతోంది. నష్టాలు వస్తున్నాయన్న సాకుతో 2021లో కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని పెట్టుబడుల నియంత్రణ బోర్డు విశాఖ ఉక్కులో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వంద శాతం పెట్టుబడిని విక్రయించాలన్న ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు దానికి ఆమోదముద్ర కూడా వేసింది. దాంతో పెట్టుబడి ఉపసంహరణ పేరుతో ప్రైవేట్‌పరం చేసే యత్నాలకు తెరలేచింది. అప్పటినుంచీ ఈ వివాదం నలుగుతూనే ఉంది. స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న వేలాది ఉద్యోగులు, కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్మిక సంఘాలు విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని ప్రారంభించి ఇప్పటికీ కొనసాగిస్తున్నాయి. పలుమార్లు యూనియన్ల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను తీసుకుని ఢిల్లీ వెళ్లి కేంద్ర ఆర్థిక, ఉక్కు శాఖల మంత్రులకు వినతిపత్రాలు సమర్పించినా, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ జేడీ లక్ష్మీనారాయణ రాష్ట్ర హైకోర్టులో కేసు వేసినా కేంద్రం తన తీరును మార్చుకోలేదు. అయితే గత ఏడాది సార్వత్రిక ఎన్నికల ముందు మారిన రాజకీయ సమీకరణాలు.. ఆ ఎన్నికల్లో అటు రాష్ట్రంలోనూ ఇటు కేంద్రంలోనూ ఎన్డీయే ప్రభుత్వాలే కొలువుదీరిన నేపథ్యంలో విశాఖ ఉక్కుకు సంబంధించి పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ అనే మాటలు వినిపించడం ఆగిపోయింది. దాని స్థానంలో స్టీల్‌ప్లాంట్ ఆర్థిక పునరుజ్జీవం పేరుతో కొత్త ప్రయోగాలు మొదలయ్యాయి. సమస్యకు మూలం ఏమిటన్నది అందరికీ తెలుసు. దాన్ని పరిష్కరిస్తే అన్నీ సమసిపోయి విశాఖ ఉక్కు మళ్లీ తలెత్తుకోగలుగుతుంది. కానీ ఎవరూ దాని ఊసెత్తడం లేదు. సొంత గనులు లేకుండానే భారీ విస్తరణ చేపట్టిన ఫలితమే స్టీల్ ప్లాంట్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభం. దీనివల్ల ఎక్కువ రేటుకు ముడిసరుకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. దానికోసం చేసిన అప్పులు, వాటికి వడ్డీల కలిపి సుమారు రూ.40వేల కోట్లకు ఎగబాకాయి. సొంత గనులు కేటాయించి, కష్టాల నుంచి గట్టెక్కించాల్సిన కేంద్రం ఆ పని చేయకుండా రాజకీయ కోణంలోనే ఆలోచిస్తూ ఆర్థిక పునరుద్ధరణ ప్యాకేజీ ప్రకటించింది. డైరెక్ట్ ఈక్విటీ కింద రూ.10,300 కోట్లు, షేర్ క్యాపిటల్‌గా రూ.1,140 కోట్లు కేటాయించింది. మరోవైపు విద్యుత్, వాటర్, ట్యాక్సుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు వేల కోట్ల మేరకు వెసులుబాటు కల్పించింది. దాంతో ఊపిరి పీల్చుకున్న విశాఖ ఉక్కు అధికారులు ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. 73 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్‌లో బ్లాస్ట్ ఫర్నేస్‌లదే కీలక భూమిక. గోదావరి, కృష్ణ, అన్నపూర్ణ పేరుతో అటువంటి మూడు బ్లాస్ట్ ఫర్నేస్(ముడి ఇనుము కరిగించే కొలిమి)లు ఇక్కడ ఉన్నాయి. వీటిలో తొలి రెండు నిర్వహణ పనుల కారణంగా నిలిచిపోగా, రా మెటీరియల్ కొరత, ఆర్థిక నష్టాల వల్ల మూడో ఫర్నేస్ కూడా కొన్నాళ్లుగా మూలన పడింది. ఆర్థిక పునరుద్ధరణ చర్యల పుణ్యాన మూడో బ్లాస్ట్ ఫర్నేస్ పునరుద్ధరణ యత్నాలు ఫలించాయి. ఆ మేరకు ఈ నెల 27న అన్నపూర్ణ కొలిమిని పున:ప్రారంభించారు. ఇకనుంచి దశలవారీగా మూతపడిన అన్ని విభాగాలను పని చేయించాలని ప్లాంట్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అదే జరిగితే స్టీల్‌ప్లాంట్‌ను మాతృసంస్థ అయిన స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం చేసేందుకు అవకాశాలు మెరుగుపడతాయి. ఆ లక్ష్యంతోనే అధికారులు పలు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మానవ వనరుల్లో భారీ కోత పెట్టిన యాజమాన్యం ఇప్పుడు కీలక విభాగాలను ప్రైవేటీకరిస్తోంది. అత్యంత కీలకమైన ఆర్ఎంహెచ్ఎస్, సింటర్ ప్లాంట్లను కాంట్రాక్టర్లకు కట్టబెట్టేందుకు నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. తీర ప్రాంతంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్లలో ప్రముఖమైనదైన ఈ ప్లాంట్‌లో కీలక విభాగాలన్నీ యాజమాన్యం పరిధిలోనే ఉండటం అనివార్యం. కానీ విభాగాలవారీగా వాటి నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్ట్ సంస్థలకు అప్పగించడం వల్ల సమన్వయం లోపించడమే కాకుండా భద్రతపరంగా ప్రమాదకరమని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుత సంక్షోభానికి మూలమైన రా మెటీరియల్ కొరత తీర్చేలా ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించడం కాకుండా విభాగాల ప్రైవేటీకరణ వంటి అనాలోచిత నిర్ణయాలు మరింత ప్రమాదకరమని ఈ రంగం నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



పీవీ చలపతిరావు 91వ జయంతి సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం విచ్చేసిన కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులున్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## సమష్టి కృషితోనే అద్భుత విజయం సాధించగలిగాం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సమష్టికృషితోనే అద్భుత విజయం సాదించగలిగామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కొనియాడారు. ఈమేరకు గురువారం సంప్రదాయ నృత్యకళాశాలలో నిర్వహించిన అభినందనసభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమ నిర్వహణలో కీలకపాత్ర పోషించిన అన్ని విభాగాల అధికారులు అందించిన సహకారాన్ని గుర్తు చేస్తూ వారి సేవలను ఆయన కొనియాడారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, ఆయుష్ టీంలను ఆయన అభినందించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శాలిహుండంలో పాల్గొన్నారన్నారు. కంట్రోల్ రూంలో విధుల నిర్వహణ, ఇంత కార్యక్రమం జరిగినా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదన్నారు. పిజి పేటలో మత్స్యకారులతో నిర్వహించిన యోగా వలనే ప్రపంచ రికార్డు సాధించామన్నారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ పాండ్రంకి మురళీకృష్ణ, స్వాతి, తదితరులు నెల రోజులపాటు శ్రద్ధ, ఓపికతో యోగాసనాలు చెప్పినట్లు కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేస్తామని, విజయవంతంగా నిర్వహించిన జిల్లా ప్రజా ప్రతినిధులు, జిల్లా యంత్రాంగంలను అభినందించారు. ఆయుష్ డాక్టర్ జగదీష్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ జిల్లాలో చేసిన యోగాసనాలను ప్రపంచం మొత్తం చూసిందని, అధికారులు చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. పిజి పేటలో నిర్వహించిన మత్స్యకార యోగాలో పెద్దఎత్తున పాల్గొన్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో నిర్వహించిన పెద్ద కార్యక్రమాలు విజయవంతం అయ్యాయన్నారు. యోగాంధ్రను విజయవంతం చేసిన జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగానికి అభినందించారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి పాల్గొనడం గొప్ప విషయమన్నారు. జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన జిల్లా కలెక్టర్‌ను అభినందించారు. వరల్డ్ రికార్డు అనేది గొప్ప విషయమని, ఇలాంటి అవకాశం ఎప్పుడు రాదన్నారు. కలెక్టర్ ఒక ప్రణాళిక ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కొనియాడారు. తహసీల్దార్లు, ఎంపిడిఓలు, జిల్లా అధికారులు ఎంతో కృషి చేసినట్లు చెప్పారు. జీవితంలో మరువలేనిది వరల్డ్ రికార్డని కొనియాడారు. ఆర్డీఓ కె.సాయిప్రత్యూష మాట్లాడుతూ యోగాంధ్రలో తనకు సహాయ సహకారాలు అందించిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు, జిల్లా యంత్రాంగం, ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు ఆయుష్ జిల్లా అధికారి డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ సిటిజన్స్ రిజిస్ట్రేషన్ 10లక్షలు దాటిందన్నారు. ఇందుకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సూచనలు, సలహాలు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సిక్కోలు ఖ్యాతిని ఇనుమడింప చేశారన్నారు. అనంతరం కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం పీజీ పేట సర్పంచ్‌కు ముఖ్యమంత్రి అందజేసిన సర్టిఫికేట్‌ను అందజేశారు. అదే విధంగా యోగా ఇన్స్ట్రక్టర్ల, వివిధ యోగా శిక్షణ సంస్థలు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ నుండి వచ్చిన యోగా ఇన్స్ట్రక్టర్లను సన్మానించారు. యోగాసనాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముందు సంప్రదాయం నృత్య కళాశాల విద్యార్థులుచే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అభినందన సభలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, ఆర్డీఓ కృష్ణమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు జి.జయదేవి, డి.పద్మావతి, వ్యాఖ్యాతగా స్వాతీసోమనాథ్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ప్రశంస పత్రం అందుకున్న యూత్‌క్లబ్ ప్రెసిడెంట్ నడుకుదిటి తేజ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ సేవలందించినందుకు గాను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతుల మీదుగా శ్రీమహాలక్ష్మి యూత్ అధ్యక్షులు నడుకుదిటి తేజబాబును ప్రశంసపత్రం, మెమంటోను అందుకున్నారు. అక్టోబర్ 2 గాంధీ జయంతిని పురస్కరించుకొని రికార్డ్ స్థాయిలో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించిన తేజబాబును ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, పెంకి చైతన్య, ప్రసాదరావు మాస్టర్ తదితరులున్నారు.




### ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజా సమస్యలపై అధికారుల సమక్షంలో తక్షణమే పరిష్కరించే విధంగా చొరవ చూపుతానని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తెస్తే సమస్య పరిష్కరించే విధంగా అధికారుల సమక్షంలో చర్యలు చేపడతామన్నారు. ఈ ప్రజాదర్బార్‌లో శ్రీకాకుళం, గార, శ్రీకాకుళ పట్టణంలోని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలపవచ్చన్నారు. సమస్యలు పరిష్కరించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రజాదర్బార్‌కు తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, శ్రీకాకుళం గార మండల ఆఫీస్ కార్యాలయ సిబ్బంది, అధికసంఖ్యలో ప్రజల వచ్చి సమస్యలపై వినతులు అందజేశారు.





## మీ సెక్షన్లు నెగిటివ్ రివ్యూల్ని ఆపుతాయా?

మంచు ఫ్యామిలీకీ ట్రోలర్స్ కీ అవినాభావ సంబంధం ఉంది. ముఖ్యంగా విష్ణుతో. విష్ణు ఏం మాట్లాడినా, ఎలా మాట్లాడినా ఓ వర్గం ట్రోల్ చేయడానికి సిద్ధంగా ఉంటుంది. ఈమధ్య ఇలా తనపై పనిగట్టుకొని ట్రోల్ చేస్తున్నవాళ్లందరిపైనా వివిధ సెక్షన్ల కింద విష్ణు కేసులు వేశారు. వాళ్లంతా పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నాయి. విష్ణు ముందస్తు జాగ్రత్తలు కాస్త ఈ తాకిడిని తగ్గించినట్టే అనుకోవాలి.

నేడు కన్నప్ప విడుదలైంది. ఈ సినిమా కోసం విష్ణు చాలా కష్టపడ్డాడు. ప్రభాస్ లాంటి బడాస్టార్లని రంగంలోకి దించాడు. దాదాపు రూ.200 కోట్లు ఖర్చు పెట్టాడు. ఓపెనింగ్ డే వసూళ్లు ఎలా ఉంటాయా? అని విష్ణుతో పాటు చిత్రసీమ కూడా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. మరోవైపు తన సినిమాపై వచ్చే ట్రోలింగ్‌ని కంట్రోల్ చేయడానికి కూడా విష్ణు సన్నద్ధంగా ఉన్నాడు. పని గట్టుకొని కావాలని విమర్శించే వాళ్లపై కఠిన చర్యలు తప్పవంటూ ఓ ప్రెస్‌నోట్ విడుదల చేశాడు. అయితే పరోక్షంగా రివ్యూలను కూడా అడ్డుకొంటామని చెప్పే ప్రయత్నం ఈ నోట్ లో కనిపించింది. తన సినిమాపై నెగిటివ్ రివ్యూలు రాకుండా విష్ణు తీసుకొన్న జాగ్రత్త ఇదేమో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఈమధ్య రివ్యూల తాకిడి బాగా ఎక్కువైంది. ఫస్ట్ షో పూర్తయిన వెంటనే రివ్యూ వచ్చేస్తోంది. ట్విట్టర్ రివ్యూలు, వీడియో రివ్యూలు షరా మామూలే. మీడియా సంస్థలే కాకుండా సినిమాపై అభిమానం, అవగాహన ఉన్నవాళ్లు కూడా తమ తమ అభిప్రాయాల్ని నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. వాళ్లని కంట్రోల్ చేయడం ఎవరి వల్లా కాదు. కన్నప్ప సినిమా బాగుంటే పర్వాలేదు. అటూ ఇటూ అయితే మాత్రం ట్రోలింగ్ పెరుగుతుంది. విమర్శలు ఘాటుగా ఉంటాయి. వాటిని ఇలాంటి ప్రెస్ నోట్‌లు, అందులో ప్రస్తావించిన సెక్షన్లు ఆపుతాయా?

సినిమా విడుదలైన తరవాత వచ్చే రివ్యూల్ని బట్టి దర్శక నిర్మాతలు, హీరోలు స్పందిస్తారు. ముందే 'నెగిటీవ్ రివ్యూలు ఇస్తే జాగ్రత్త..' అంటూ వార్నింగ్ ఇవ్వడం ఇదే తొలిసారి. ఈ ఎఫెక్ట్ ఎలా ఉంటుందన్నది కూడా ఆసక్తి రేకెత్తిస్తోంది. సినిమా బాగున్నా.. నెగిటీవ్ రివ్యూలు ఇస్తే అది కావాలని చేస్తున్న పనే అనుకోవాలి. ఒక వేళ నిజంగా కన్నప్ప జనాలకు, విశ్లేషకులకు నచ్చకపోతే నిష్పక్షపాతంగా, ఉన్నది ఉన్నట్టు విమర్శిస్తే దాన్ని కన్నప్ప టీమ్ పాజిటీవ్ గా తీసుకొంటుందా? అనేదీ అనుమానమే. జనాభిప్రాయాల్ని, రివ్యూల్ని ఇలాంటి హెచ్చరికలు ఆపలేవు. చట్టం తన పని తాను చేసుకొని పోయినట్టే.. రివ్యూ రైటర్లు కూడా తమ పని తాము చేసుకొంటూ పోతారు ఈ విషయంలో ఎవరి కంట్రోల్ ఉండదు. దాన్ని విష్ణు తెలుసుకొంటే మంచిది.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

## "మైసా"- రష్మిక వైల్డ్ అవతార్

రష్మిక మందన్నా.. ప్రస్తుతం పాన్ ఇండియా రేంజ్‌లో దూసుకెళ్తున్న నేషనల్ క్రష్. 'యానిమల్', 'పుష్ప 2', 'కుబేరా', 'ఛావా' చిత్రాలతో వరుస విజయాల జోరు మీదున్న రష్మిక.. ఇప్పుడు మరో విభిన్న పాత్రతో స్క్రీన్‌పై సంచలనం కలిగించబోతోందనే టాక్. ఆమె నటిస్తున్న కొత్త చిత్రం 'మైసా' పేరుతో అధికారికంగా ప్రకటించబడింది. రవీంద్ర పుల్లే దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిలిమ్స్ సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. హను రాఘవపూడి సహాయకుడిగా పని చేసిన రవీంద్ర, ఈ చిత్రంతో డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ రష్మిక కొత్త యాంగిల్‌ను చూపించి అందరిలో ఆసక్తిని పెంచింది. అలాగే ధనుష్ (తమిళ), విక్కీ కౌశల్ (హిందీ), దుల్కర్ సల్మాన్ (మలయాళం), శివ రాజ్ కుమార్ (కన్నడ), దర్శకుడు హను రాఘవపూడి (తెలుగు) లాంటి స్టార్ సెలెబ్రిటీస్ చేతుల మీదుగా ఫస్ట్ లుక్ రిలీజ్ చేయడం విశేషం. రష్మికను ఎంతో స్పెషల్‌గా ప్రెజెంట్ చేస్తూ.. సినిమా టైటిల్‌ను "మైసా"గా అనౌన్స్ చేశారు. ఇది 'గోండ్ తెగ' మహిళ పాత్ర ఆధారంగా రూపొందినట్టు స్పష్టమవుతోంది. తాజా ఫస్ట్‌లుక్‌లో రష్మిక గోండ్ తెగ మహిళ అవతారంలో కనిపించింది. చేతిలో ఆయుధంతో, భయానకమైన భావాలతో నిలబడిన రష్మిక లుక్ ప్రేక్షకులను షాక్‌కు గురి చేసింది. ఆమె లుక్ చూస్తుంటే పాత్రలో పవర్ఫుల్ ఏమోషన్ ఉండనున్నట్లు అర్థమవుతుంది. ఇప్పటి వరకు చూడని రష్మిక పూర్తిగా కొత్త కోణంగా కనిపించడమే కాకుండా హంటెడ్, వుండెడ్, అన్‌బ్రోకెన్ అనే ట్యాగ్ లైన్ సినిమాకు ఇంటెన్సిటీని చాటుతోంది. దర్శకుడు రవీంద్ర పుల్లే మాట్లాడుతూ.. "ఈ కథను రెండు సంవత్సరాల పాటు మెరుగుపరచాం. ప్రతీ అంశాన్ని పర్ఫెక్ట్ గా ఉండేలా శ్రమించాం. ఇప్పుడు ప్రపంచానికి ఈ కథను చెప్పేందుకు సిద్ధమవుతున్నాం" అని తెలిపారు. సినిమాలో గోండ్ తెగల జీవితంలో ఎదురయ్యే కష్టాలు, పోరాటాలు నేపథ్యం లో యాక్షన్ థ్రిల్లర్ కథాంశాన్ని చూపించబోతున్నట్టు తెలుస్తోంది. ఇదే సమయంలో నిర్మాతలు అజయ్, అనిల్ సయ్యపురెడ్డి, సహనిర్మాత సాయి గోపా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. యూనిట్ షేర్ చేసిన ఫస్ట్‌లుక్ సినిమాపై అంచనాలను పెంచేసింది. సాంకేతిక బృంద వివరాలు త్వరలో ప్రకటించనున్నట్టు తెలిపారు. మొత్తానికి రష్మిక మైసా పోస్టర్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇక సినిమా ఏ రేంజ్‌లో ఉంటుందో చూడాలి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..



## పాతపట్నంలో సుపరిపాలనలో తొలి అడుగు



(సత్యంన్యూస్, పాతపట్నం)

టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తన స్వగృహంలో కూటమి పాలనపై సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలు, కూటమి ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాల గురించి చర్చించారు. కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ యూనిట్, బూత్ ఇంచార్జ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కెఎస్ఎస్ సభ్యులు తమవంతు బాధ్యతగా ప్రతి ఇంటిని ప్రతిగడపను సందర్శించి గడపగడపకు కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఈ కార్యక్రమంలో సందర్శించిన ఇళ్లను నమోదు చేయడానికి తెలుగుదేశం పార్టీ తరపున మై టిడిపి అని అందుబాటులోకి తీసుకు వచ్చారన్నారు. ఈ యాప్‌లో ఉపయోగించే విధానాలను వివరంగా పొందు పరిచారని తెలిపారు. కార్యక్రమంలో ఐదు మండలాల మండల పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు,క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## మేఘవరం పంచాయతీలో జన జాతీయ గౌరవ వర్ష వేడుకలు

(సత్యంన్యూస్, టెక్కలి)

బీజేపీ దర్తి అబిజన్ భగీదరి అభియాన్ యోజన పథకం కింద 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గిరిజనులు భాగస్వాములు చేస్తూ గిరిజనులకు సంక్షేమం, అభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా రూ.80వేల కోట్లు విడుదల చేసినట్లు టెక్కలి నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ నాయకులు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక మేఘవరం పంచాయతీ జీడిపేట గ్రామంలో 150 జన జాతీయ గౌరవ వర్ష వేడుకలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఐటీడీఏ ఉన్నతాధికారులు ఏటిడబ్ల్యుఓ, ఎంపిడిఓ, వివిధ శాఖలకు సంబంధించిన సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొని ప్రజల నుండి సమస్యలపై వినతులు స్వీకరించి తక్షణమే పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు జర్జన రాంజీ, నియోజకవర్గ కో-కన్వీనర్ నడిపూరు లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

(సత్యంన్యూస్, పలాస)

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలను ప్రైవేటీకరించే ఆలోచనను తక్షణమే ప్రభుత్వం విరమించుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పి.డి.యస్.యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పలాస పిడియస్‌యు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 107, 108 జీవోలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అసంపూర్తిగా ఉన్న 17మెడికల్ కళాశాల పనులు పూర్తి చేయకపోగా మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు పూనుకుందన్నారు. పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్ విధానాన్ని (పి4) తీసుకొచ్చిందని, మెడికల్ కళాశాలల భూములు 60 సంవత్సరాలకు కార్పొరేటర్ శక్తులకు లీజుకి ఇచ్చే ప్రయత్నాలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆధీనంలో మెడికల్ కళాశాలలో నిర్వహించలేమని జాతీయ మెడికల్ కౌన్సిలకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయడం సరైన నిర్ణయం కాదన్నారు. వీటిని వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్య వైద్య రంగాలు ప్రైవేటీకరణ వల్ల ఇప్పటికే విద్య మార్కెట్లో అంగడి సరుకుగా మారిందన్నారు. చదువుకున్నవాడిది పోయి చదువు కొనుక్కున్న వాడిది విద్యగా మారిందన్నారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను విరమించుకొని 107 ,108 జీవోలు తక్షణమే రద్దు చేయాలని, అసంపూర్తిగా ఉన్న 17 మెడికల్ కళాశాల పనులు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జులై మొదటి వారంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చూడతామన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, పవన్, సోమేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## గేట్‌లో 241 ర్యాంక్ సాధించిన ఐఐఐటీ విద్యార్థిని

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

గేట్-2025 పరీక్షలో 241వ ర్యాంక్ సాధించి తమ ప్రతిభను చాటిన ఆర్జీయూకేటీ (ట్రిపుల్ ఐటీ) శ్రీకాకుళం సీఎస్ఇ విభాగ విద్యార్థిని కొమరాల శ్వేతశ్రీను యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్వేతశ్రీ తదుపరి విద్యలో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించి, విశ్వవిద్యాలయానికి మంచి పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. శ్వేతశ్రీ పల్నాడు జిల్లా దుగ్గి గ్రామానికి చెందినవారు. గ్రామీణ నేపథ్యంలో పెరిగిన ఈ యువతి తండ్రి ఆదినారాయణ, తల్లి అరుణల ఆనందానికి అవధుల్లేకుండా చేసింది. అభినందన కార్యక్రమంలో పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, వాసు, డాక్టర్ రవి గేదెల, సాగర్, కోడా దిలీప్‌కుమార్, నూకేశ్వరరావు, డాక్టర్ రాకోటి శ్రీనివాసరావు, డాక్టర్ గణేష్ మళ్ళా, తేజ కిరణ్, సింహాచలం తదితరులు పాల్గొని శ్వేతశ్రీ ను అభినందించారు.



## మండల హెడ్‌క్వార్టర్‌లో గ్రీవెన్స్

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్‌ను శుక్రవారం ఎచ్చెర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఎంపీడీఓ, తహసీల్దార్‌లకు పంపించి వాటిని పరిష్కరించే విధంగా ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షులు చౌదరిబాబ్జి, టీడీపీ మండల అధ్యక్షులు బెండు మల్లేశ్వరావు, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ సంపతిరావు నాగేశ్వరరావు, పెద్దలు జీరు రామారావు, బీజేపీ మండల అధ్యక్షులు సనపల రామారావు, జనసేన మండల అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాస్, టీడీపీ ప్రధానకార్యదర్శి వావిలపల్లి రామక్రిష్ణ, అన్నిశాఖల అధికారులు, కూటమి నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## టీడీపీ రూరల్ నూతన కార్యవర్గం సిద్ధం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నూతనంగా ఎన్నికైన టీడీపీ రూరల్ అధ్యక్ష బృందానికి శుభాకాంక్షలని, ప్రజాసేవకే మనజీవితం అంకితమని, చిత్తశుద్ధితో మనమంతా బాధ్యతవహించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఎనభై అడుగుల కూడలిలో గల టీడీపీ పార్టీ కార్యాలయంలో పరిశీలకులు చింతలపూడి రామకృష్ణ, శాసనసభ్యులు గొండు శంకర్‌ల అధ్యక్షతన జరిగిన సమావేశంలో రూరల్ మండల అధ్యక్షులుగా కల్లేపల్లి గ్రామానికి చెందిన మూకళ్ళ శ్రీనివాసరావు, శిలగాం సింగువలసకు చెందిన కంచు దశరథరావు ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారన్నారు. ఈ సందర్భంగా గొండు శంకర్ మాట్లాడుతూ మనమీద నమ్మకంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బాధ్యతను అందించారని, అదే నమ్మకంతో ప్రజాసేవ చేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.






పాలకొండ శాఖా గ్రంథాలయంకు ఉపాధ్యాయులు సాహిని రమేష్ పట్నాయక్ నీట్ పరీక్ష పుస్తకాలు, ఇంటర్మీడియట్ పుస్తకాలు, కొన్ని మోడల్ పుస్తకాలను స్థానిక గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబుకు ప్రవేశ పరీక్షల కోసం అందించారు.

– సత్యంన్యూస్, పాలకొండ

## ఆమదాలవలస పట్టణంలో ప్రజాదర్బార్



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆమదాలవలస పట్టణంలో గల టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే, పీయూసీ రాష్ట్ర చైర్మన్ కూన రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి పలు ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

# జిల్లా రెడ్ క్రాస్ ద్వారా విస్తృత సేవలు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా విస్తృత సేవలు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం, అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయ న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రకృతి విపత్తుల సమయంలో సంభవించిన సమయంలో రెడ్‌క్రాస్ సేవలందిస్తుందన్నారు. గత ఏడాది విజయవాడలో వచ్చిన వరదల సమయంలో రెండు ట్రక్కుల వివిధ వస్తువులు పంపించి అక్కడి ప్రజలను ఆదుకున్నట్లు గుర్తుచేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రక్తం సేకరించి అవసరమైన వారికి అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో తలసేమియా ఉన్న 28మందిని గుర్తించి వారికి రక్తం సరఫరా చేస్తున్నట్లు వివరించారు. శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీకి రాష్ట్రస్థాయిలో మంచి పేరు ఉన్నట్లు పేర్కొన్నారు. మొక్కలు నాటే కార్యక్రమం ఈ యేడాది జిల్లాలో పెద్దఎత్తున చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని చెప్పారు. సియస్ఆర్ ఫండ్స్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. రాష్ట్ర రెడ్‌క్రాస్ ద్వారా వచ్చే నెల 9వ తేదీన జిల్లా కలెక్టర్ అవార్డు అందుకోనున్నట్లు వైస్ చైర్మన్ జగన్మోహనరావు వెల్లడించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా సంవత్సరంలో చేసిన సేవలు గూర్చి ఆయన వివరించారు. రక్తం సేకరించిన వివిధ స్వచ్ఛంద సంస్థలు, జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలకు మెమెంటోలతో సన్మానించారు. ముందుగా యేడాదిలో చేసిన సేవలు, రక్త సేకరణకు సంబంధించి ఫోటో ప్రదర్శనను తిలకించారు. రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు జాన్ హెన్రీ జూనాంట్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంవత్సరంలో చేసిన కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రెడ్‌క్రాస్ సొసైటీపై ప్రతిజ్ఞ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు పి. జగన్‌మోహన్‌రావు, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.సుధీర్, ట్రజరర్ కె.దుర్గారావు, ఎజిఎం పరిశీలకులు పార్వతీపురం మన్యం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎం.శ్రీరాములు, పెంకి చైతన్యకుమార్, కె.సత్యనారాయణ, ఆర్ట్స్ సంస్థ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ యోగాంధ్ర ఇన్స్ట్రక్టర్లకు సన్మానం

రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు యోగా కార్యక్రమంలో భాగంగా నెలరోజుల పాటు యోగాంధ్ర నిర్వహించిన ఆయుష్ జిల్లా అధికారి డాక్టర్ జగదీష్, డాక్టర్ ఉత్తమ్ రాజు, డాక్టర్ సునీల్, డాక్టర్ మోహన్ రావు, జె.చంద్రశేఖర్, ఆయుష్ సిబ్బంది, ఇన్స్ట్రక్టర్లు పాండ్రంకి మురళీకృష్ణ, తంగి స్వాతి, తదితరులకు సర్టిఫికేట్, మెడల్స్ తో సత్కరించారు. సన్మానించిన వారిలో రెడ్ క్రాస్ సొసైటి వైస్ చైర్మన్ పి. జగన్మోహన్ రావు, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ పి. రజనీకాంత్, ఆర్ట్స్ సంస్థ సన్యాసి రావు, వాకర్స్ ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు, కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణుగోపాల్ రావు, డాక్టర్ సింధూర, తదితరులు పాల్గొన్నారు.

## రావాడ పంచాయతీ వైకాపా నాయకులకు 'కార్యకర్తే కీలకం'

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

వైకాపా ఆధ్వర్యంలో చేపడుతున్న "కార్యకర్తే కీలకం" కార్యక్రమంలో భాగంగా ఆరవరోజు శుక్రవారం రావాడ పంచాయితీ కార్యకర్తలకు నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొని వారిలో భరోసా నింపారు. ఈమేరకు తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రావాడ పంచాయితీ వైకాపా నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యకర్త ఉంటేనే పార్టీకి మనుగడ ఉంటుందన్నారు. పార్టీలో ప్రతీ కార్యకర్త సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేసే దిశగా అడుగులువేయాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత పటిష్టంగా బలపరిచి ప్రజలకు అండగా నిలబడాలన్నారు. కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలకు వ్యతిరేకంగా వైకాపా అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' పేరిట చేపట్టబోతున్న కార్యక్రమాన్ని అందరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా "రీ కాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో"... చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ కార్యక్రమాన్ని మొదట జిల్లాస్థాయిలో, రెండవ విడతగా నియోజకవర్గ స్థాయిలో, మూడవ విడతగా మండల స్థాయిలో, నాలుగవ విడతగా గ్రామస్థాయిలో రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీలు విస్మరించి పాలన సాగించడం, సంక్షేమ పథకాలు ఎగ్గొట్టి ప్రజలకు ఎంత బకాయిలు పడ్డారనే విషయమై ప్రజలను చైతన్యపరచడంపై విస్తృతస్థాయి సమావేశంలో వీడియోల రూపంలో అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. గ్రామ కమిటీలను త్వరతగతిన పూర్తి చెయ్యాలన్నారు. గ్రామ కమిటీలను పూర్తిచేస్తేనే ప్రజలకు చంద్రబాబు మోసాలను వివరించడం సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, ఎచ్చెర్ల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దన్నాన హరి, ఎచ్చెర్ల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు మజ్జి రమేష్, ఎంపిటీసి ప్రతినిధి కిల్లారి సూర్యనారాయణ, మాజీ ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షులు కిల్లారి రమణ, నాయకులు లంక పాపారావు, బూర సత్యం, బొంతు సూరి, కిల్లారి అప్పలనాయుడు, లంక అసిరినాయుడు, లంక రాము, లంక



రమణ, గొర్లె రమణ, గొర్లె అప్పలరాం, గొర్లె మోహన్, లంక కూర్మినాయుడు, లంక శ్రీను, లంక కాంతారావు, లంక కృష్ణ, లంక అప్పలనాయుడు, లంక లక్ష్మనాయుడు, లంక గౌరి నాయుడు, కెల్ల రమేష్, కెల్ల సురేష్, కెల్ల శ్రీనివాసరావు, కెల్ల సురేష్, పిల్ల రాము నాయుడు, రెడ్డి అసిరినాయుడు, సనపతి తవుడు, సనపతి సత్యం, సనపతి అప్పల నాయుడు, షేక్ సూరి, తాళాడ అప్పయ్య, బాణాల ప్రభాకర్, ముక్కు ఈశ్వరరావు, తీటి మల్లి, అలజంగి దాలయ్య, ముక్కు అమావాస్య, ముక్కు శ్రీరాములు, ముక్కు బంగారి, యామల అప్పారావు, గంట్యాడ అప్పలనాయుడు, గొర్లె కృష్ణ, బొంతు కోటి, బొంతు లక్ష్మణ, కోండ్రు పండోడు, మన్నేల రామకృష్ణ, లోడగల సూరి, బూర తవుడు, బొంతు అప్పలనాయుడు, బార అప్పన్న, బొంతు సూర్యనారాయణ, లంక స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

















# జనం చెంతకు జగన్నాథుడు

❖ పూరీ క్షేత్రాన్ని తాకిన భక్తజన కెరటం
❖ కుంభమేళా తర్వాత అంతపెద్ద ఆధ్యాత్మిక వేడుక
❖ కృష్ణావతారానికి కొనసాగింపు జగన్నాథుడని నమ్మిక

**వైభవంగా జగన్నాథ రథయాత్ర**

డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి

హిందువులు అతిపవిత్ర పుణ్యక్షేత్రాలుగా భావించే నాలుగు ధామాల్లో(చార్‌ధామ్) ఒడిశాలోని పూరీ క్షేత్రం ఒకటి. ప్రతిరోజూ ఈ క్షేత్రాన్ని వేలసంఖ్యలో దేశవిదేశాల భక్తులు సందర్శిస్తుంటారు. అంతే కాకుండా ఏడాదికోసారి ఈ క్షేత్రంలో జరిగే రథ యాత్ర విశ్వవిఖ్యాతి పొందింది. మహా కుంభమేళా తర్వాత అంత భారీస్థాయిలో అంటే లక్షల్లో రథ యాత్ర ఒక్కరోజే పూరీ క్షేత్రాన్ని భక్తజనం పోటెత్తుతారు. ప్రాచీన క్షేత్రాల్లో ఒకటైన పూరీ జగ న్నాథస్వామి ఆలయానికి దాదాపు ఐదు వేల ఏళ్ల చరిత్ర ఉంది. అప్పటినుంచీ నిరంత రాయంగా ఇక్కడ రథయాత్ర జరుగుతోంది. రథయాత్ర మన దేశంలో జరిగే అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవం. సాధారణంగా భక్తులే దేవుడి చెంతకు వెళ్లి దర్శించుకోవడం సంప్రదాయం. కానీ ఈ క్షేత్రంలో కొలువైన జగన్నాథ, బలభద్ర, సుభద్రలే స్వయం గా భక్తజనుల మధ్యలోకి వచ్చి దర్శనభాగ్యం కలిగించడమే ఈ రథయాత్ర విశేషం. ఇది చూడ టానికి హిందూ మత ఆధ్యాత్మిక కార్యక్రమమే అయినా అంతర్లీనంగా సమా జంలో సమానత్వం, ఐక్యత అనే సందేశాన్ని ఇస్తుంది. ఏ కులం, మతం, వర్గానికి చెందిన వారైనా రథయాత్రలో పాల్గొనవచ్చు. స్వామి రథాలు బయలుదేరడానికి ముందు చెరా పొహరా పేరుతో వాటిముందు స్వయంగా పూరీ మహా రాజే బంగారు చీపురుతో రథం ముందుభాగానిన ఊడ్చి శుభ్రం చేస్తారు. దేవుడి ముందు అందరూ సమానమే అనే భావన ఇది ప్రస్ఫుటం చేస్తుంది. అంతటి విశిష్టమైన రథయాత్ర ప్రతి ఏటా ఆషాఢ శుద్ధ విదియనాడు ప్రారంభం కావడం ఆనవాయితీ. ఆ ప్రకారం ఈ ఏడాది రథయాత్ర శుక్రవారం ప్రారంభమైంది. ప్రపంచం నలుమూలల నుంచి ఇప్పటికే లక్షల సంఖ్యలో భక్తులు పూరీకి చేరుకున్నారు. తెల్లవారు జామునే ఆలయంలో ప్రారంభమైన ప్రత్యేక పూజ లు మధ్యాహ్నం వరకు కొనసాగుతాయి. అనం తరం సాయంత్రం నాలుగు గంటలకు జగన్నాథ, బలభద్ర, సుభద్రల విగ్రహాలు ఆలయం నుంచి బయటకు తీసుకొచ్చి ప్రత్యేకంగా రూపొందించిన రథాల్లో అధిష్టింప జేస్తారు. ఆ వెంటనే రథయాత్ర



కొనసాగి గుండిచా మందిరం వరకు సాగుతుంది. అక్కడ పది రోజుల భక్తుల పూజలు అందుకున్న తర్వాత దేవదేవుడు తిరిగి ప్రధాన ఆలయానికి చేరుకుంటాడు. దీన్నే మారు రథయాత్ర అంటారు.

### సాక్షాత్తు కృష్ణపరమాత్మే

పేరు వేరైనా జగన్నాథస్వామిని సాక్షాత్తు కృష్ణ పరమాత్మగానే భావిస్తారు. దశావతారాల్లో భాగం గా శ్రీమహావిష్ణువు ద్వాపర యుగంలో శ్రీకృష్ణావ తారం ఎత్తుతాడు. దుష్టశిక్షణ అనంతరం అడవిలో ఓ చెట్టు కింద శయనించి కాలు మీద కాలు వేసుకుని పిల్లనగ్రోవి ఊదూతూ తదాత్మ్యం చెందుతున్న కృష్ణుడి కాలి బొటనవేలును దూరం నుంచి చూసిన ఓ బోయవాడు దాన్ని ఒక జంతువుగా భ్రమించి బాణం వేస్తాడు. ఆ బాణం కృష్ణుడి బొటన వేలికి తగులుతుంది. అందులోనే ఉన్న అతని ప్రాణాలు పోవడానికి అది కారణమ వుతుంది. దాంతో కృష్ణుడు నిర్యాణం చెందాడని, కృష్ణావరం పరిసమాప్తమైందని, అక్కడితో ద్వాపర యుగం కూడా ముగిసి కలియుగం ప్రారంభ మైందని అంటారు. కానీ కృష్ణుడు భౌతికంగా నిర్యాణం చెందినా.. అతని ఆత్మ మాత్రం భూమి పైనే ఉండిపోయిందని, అది ఒక చెట్టుకు చెందిన కలప మొద్దులో నిక్షిప్తమై ఉందని ప్రతీతి. సుమారు ఐదువేల ఏళ్ల క్రితం పూరీ పాలకుడైన ఇంద్రద్యుమ్న మహారాజుకు శ్రీకృష్ణుడు కలలో కనిపించి ఇదే విషయం చెప్పి ఆ కలప మొద్దు సముద్ర ప్రవాహంలో కొట్టుకుపోతోందని, దాన్ని తీసుకొచ్చి తనకు పూజలు చేయాలని సూచించా డట. దైవాజ్ఞ ప్రకారం ఇంద్రద్యుమ్నుడు సముద్రం లో తన సిబ్బందితో గాలించి భారీ దుంగను స్వాధీనం చేసుకుని, దాన్ని విగ్రహాలుగా మలచి, ఆలయం నిర్మించి, పూజలు చేయడం మొదలు పెట్టాడు. ఈ యుగంలో స్వామి జగన్నాథుడిగా సేవలు అందుకుంటున్నా, కృష్ణావతారంలో అతని అన్న అయిన బలరాముడు సుమారుగా అదే పేరు తో బలభద్రుడిగా, సోదరి సుభద్ర పూర్తిగా అదే పేరుతో భక్తులకు దర్శనం ఇస్తుండటం శ్రీకృష్ణుడే జగన్నాథుడన్న వాదనను బలపరుస్తోంది.

### రథాలను లాగే తాళ్లకు పేర్లు

రథయాత్ర రోజు జగన్నాథుడు 16 చక్రాలు కలిగిన నందిఘోష్ అనే రథంలోనూ, బలభద్రుడు 14 చక్రాలు కలిగిన తాళధ్వజ్ అనే రథంలో, సుభద్ర 12 చక్రాలు కలిగిన దేవుదళ అనే రథంలో ఆశీనులై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇస్తారు. రథయాత్ర సందర్భంగా ఈ రథాలను లాగడానికి, అందుకు వీలుగా వాటికి కట్టిన తాళ్లను పట్టుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో పోటీ పడతారు. విశేషమేమిటంటే రథాలకు ఉన్నట్లే.. వాటిని లాగేందుకు ఉపయోగించే తాళ్లకు కూడా ప్రత్యేక పేర్లు ఉన్నాయి. జగన్నా థుడి రథాన్ని లాగే తాడును శంఖచూడుడు అని వ్యవహరిస్తారు. బలభద్రుడి రథాన్ని లాగే తాడును వసూలి అని, మధ్యలో ఉండే సుభద్ర రథాన్ని లాగే తాడును స్వర్ణచూడ అని వ్యవహరిస్తారు. రథ యాత్ర సందర్భంగా ఈ తాళ్లను పట్టుకుని రథా లను లాగడానికి భక్తులు పోటీ పడతారు. ఈ తాళ్ల ను తాకి కాసేపైనా రథాన్ని లాగడంలో పాలు పంచుకుంటే జీవన్మరణ చక్రం నుంచి విముక్తి లభిస్తుందని ప్రతీతి. కుల, మత, వర్గం అన్న తారతమ్యం లేకుండా ఎవరైనా ఈ తాళ్లను పట్టుకోవచ్చు రథాలను లాగవచ్చు.


# అద్దెకు ఇవ్వబడును

చిన్నబజారు దూదివారి కోవెల ఎదురుగా
మూడు ఫ్లోర్ల బిల్డింగ్ అద్దెకు ఇవ్వబడును.
ఒక్కో ఫ్లోర్ 1200 చదరపు అడుగులు (20×60)
- వివరాలకు సంప్రదించగలరు -
9866 222 636


## రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గొర్లె



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మాజీ జెడ్పీటీసీ, తెలుగుదేశం పార్టీ నాయకుడు గొర్లె లక్ష్మణ రావు శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయప డ్డారు. ఎచ్చెర్లలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్ నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు రణస్థలం నుంచి ఎచ్చెర్ల వరకు బస్సులో వచ్చిన లక్ష్మణరావు గ్రీవెన్స్ జరుగుతున్న చోటుకు రోడ్ క్రాస్ చేస్తుండగా ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గ్రీవెన్స్‌లోనే ఎమ్మెల్యే ఈశ్వరరావుతో పాటు కూటమి నాయకులు ఉండటంతో ఈయన్ను హుటాహుటిన శ్రీకాకుళం కిమ్స్ ఆసు పత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో అత్య వసర చికిత్స అందిస్తున్నారు. ఎమ్మెల్యే ఈశ్వరరావు నేరుగా వైద్యులతో మాట్లాడి అవసరమైన సహాయానికి ముందుకొచ్చారు. ఎమ్మెల్యేతో పాటు సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్, బీజేపీ నాయకులు పైడి వేణుగోపాలం, గేదెల చైతన్య తదితరులు ఆసు పత్రికి వెళ్లినవారిలో ఉన్నారు.



# ఆధార్ మార్చి.. అందరినీ ఏమార్చి..!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఒడిశా రాష్ట్రంలో నివాసం ఉంటున్న పువ్వాడ సన్యాసిరావు అనే వ్యక్తి జనవరి నెలలో శ్రీకాకుళానికి వచ్చి జేసీని కలసి తన స్థలాన్ని ఆక్రమించి అమ్మేశారని ఫిర్యాదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన అనుసూరి వెంకటరమణను స్థల యజమానిగా చూపించి శ్రీకాకుళం బలగలో నివాసం ఉంటున్న వాకలవలసకు చెందిన తారకేశ్వరరావు తన పేరుతో 2024 జూలై 4న డాక్యుమెంట్ నెంబర్ 4962/2024 ద్వారా తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై స్వయంగా విచారణ జరిపిన జేసీ ఫర్మాన్ ఖాన్.. జిల్లా రిజిస్ట్రార్, ఆమదాలవలస సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్, ఆరోపణలు ఎదుర్కొంటున్న తారకేశ్వరరావు, బాధితుడు సన్యాసిరావు తదితరులను పిలిపించి వారి వాంగ్మూలాలు నమోదు చేశారు. దాన్ని అక్రమ రిజిస్ట్రేషన్‌గా తేల్చారు. తక్షణమే వాకలవలస వద్ద వేసి అజంతా లే అవుట్‌లో లావాదేవీలు నిలిపేయాలని ఆమదాలవలస సబ్ రిజిస్ట్రార్ పాటు జిల్లా రిజిస్ట్రార్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆధార్‌ను ట్యాంపరింగ్ చేయడాన్ని తీవ్రంగా నేరంగా పరిగణించి, బాధితుడు సన్యాసిరావు ద్వారా ఎస్పీకి ఫిర్యాదు చేయించారు. ఆ మేరకు శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుడు తారకేశ్వరరావును పిలి పించి విచారించగా అసలు యజమాని ఎవరో తెలియ దని తప్పించుకునేందుకు యత్నించాడు. అయితే జేసీ, పోలీసులు చేసిన హెచ్చరికలతో దిగివచ్చి రిజి స్ట్రేషన్ రద్దు చేసుకోవడానికి అంగీకరించాడు. దీంతో రిజి స్ట్రేషన్ రద్దుకు జేసీ ఆదేశాలు జారీచేశారు. అయితే విక్రేత, కొనుగోలుదారుడు ఇద్దరూ ఉంటే తప్ప రిజిస్ట్రేషన్ రద్దు చేయడానికి వీలు కాదని తెలియడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి డిక్రీ పొందాలని బాధితుడికి జేసీ సూచించి నట్టు తెలిసింది. ఆ మేరకు బాధితుడు కోర్టును ఆశ్రయిం చాడు. మరోవైపు పోలీసు దర్యాప్తు కొనసాగుతోంది.

### మోసం జరిగిందిలా..

వాకలవలసలో శ్రీకాకుళానికి చెందిన నటుకుల వెంకట విఠల్ నేతాజీ 1996లో ఉడా అప్రూవల్‌తో అజంతా రియల్ ఎస్టేట్ వెంచర్ పేరుతో లే అవుట్ అభివృద్ధి చేసి ప్లాట్లు అమ్మకానికి పెట్టారు. ఈ వెంచర్‌లో సర్వే నెంబర్ 32/5,7లలో 231 చదరపు



గజాల విస్తీర్ణం కలిగిన 202వ నెంబర్ ప్లాట్‌ను 1997 నవంబర్ 24న నెం.2804/1997 రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ద్వారా పువ్వాడ సన్యాసిరావు కొనుగోలు చేశారు. విజయనగరానికి చెందిన సన్యాసిరావు చాలా ఏళ్ల క్రితం కటక్‌లో స్థిరపడ్డారు. అందువల్ల ఆయన ఎలా ఉంటారో.. ఎక్కడ ఉంటారో ఇక్కడివారెవరికీ తెలియదు. ఇదే అదనుగా సన్యాసిరావు కొనుగోలు చేసిన ప్లాట్‌ను ఏదో విధంగా సొంతం చేసుకోవాలని కుట్ర పన్నారు. అందులో భాగంగానే అనపర్తికి చెందిన అనుసూరి వెంకటరమణకు చెందిన ఆధార్ నెంబర్‌కు పువ్వాడ సన్యాసిరావు వివరాలు జోడించారు. ఆధార్‌లో అను సూరి వెంకటరమణ ఫోటో అలాగే ఉంచి పేరు, చిరు నామాలను మాత్రం బాధితుడు సన్యాసిరావు వివరాలు చేర్చి ఆధార్ అప్‌డేట్ చేయించారు. దాన్నే చూపించి పువ్వాడ సన్యాసిరావే స్థలం అమ్ముతున్నట్లుగా రిజిస్ట్రేషన్ అధికారులను మాయ చేసి రిజిస్ట్రేషన్ చేయించేశారు. అని నమ్మించి స్థలాన్ని కొట్టేశారు. వాస్తవానికి కటక్‌లో ఉంటున్న బాధితుడు సన్యాసిరావు అక్కడే 2012 మార్చి 29న 6626 5179 5747 నెంబర్‌తో ఆధార్ కార్డు పొందాడు. కానీ రిజిస్ట్రేషన్ పత్రాల్లో పేర్కొన్న ఆధార్ నెంబర్ 4439 1243 6933 అనపర్తికి చెందిన సన్యాసిరావుదని విచారణలో గుర్తించారు.

### దాన్ని గుర్తించారు ఇలా..

అజంతా లే అవుట్‌లో అక్రమంగా క్రయవిక్రయాలు జరుగుతున్నాయని తెలుసుకున్న బాధితుడు సన్యాసిరావు కుమారుడు ఆ లే అవుట్‌లో ఉన్న తమ స్థలానికి ఈ ఏడాది జనవరిలో ఈసీ తీయించగా అందులో వేరొకరి పేరుతో రిజిస్టర్ అయినట్లు తెలిసింది. ఆమదాలవలస సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సేల్ డీడ్‌కు చెందిన సర్టిఫైడ్ కాపీ కూడా తీసుకుని పరిశీలించగా అందులో ఉన్న ఆధార్‌లో ఫోటో తేడా ఉండడంతో ఈ-ఆధార్ కార్డు డౌన్‌లోడ్ చేశారు. ఫోన్ నెంబర్‌తో సహా అన్ని వివరాలు మారిపోయినట్లు గుర్తించారు. అందులో ఉన్న ఫోన్ నెంబర్‌కు కాల్ చేసి అది అనపర్తికి చెందిన వెంకటరమణదిగా నిర్ధారించారు. ఆయన్ని సంప్రదిం చగా, తాను ఇటీవల ఆధార్ అప్‌డేట్‌కి ఇచ్చినప్పుడు తన వివరాలు తప్పుగా నమోదైనట్లు తెలిసిందని చెప్పాడు. అలాగే వెంకటరమణ ఆధార్‌లో ఫింగర్ ప్రింట్స్ (బయోమెట్రిక్)ను కూడా వేరేవారివి జత చేసినట్టు తెలిసింది. వెంకటరమణ ఫోటోతో సన్యాసి రావు చిరునామాతో మూడో వ్యక్తికి చెందిన ఫింగర్ ప్రింట్స్‌తో ఉన్న ఆధార్‌ను తీసుకువచ్చి తారకేశ్వర రావుకు స్థలం విక్రయించినట్టు రిజిస్టర్ చేయించారని రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఆధార్ కార్డు మార్ఫింగ్ చేసిన వారిని గుర్తించాలని కోరుతూ బాధితుడు సన్యాసిరావు మార్చి 29న ఎస్పీకి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఒకటో పట్టణ సర్కిల్ కార్యాలయంలో కేసు నమోదైంది. ఆధార్ ట్యాంపరింగ్ చేసిన వ్యక్తులు వాకలవలస, రాగోలుకు చెందిన వారేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### 60 ప్లాట్లపై వివాదాలు

అజంతా లే అవుట్‌లో 495 ప్లాట్లు ఉన్నాయి. వీటిలో సుమారు 60 ప్లాట్లపై వివాదాలు ఉన్నాయి. పలు ప్లాట్లను అసలు యజమానులకు తెలియకుండా ఆధార్ ట్యాంపరింగ్ చేసి అమ్మేసినట్లు ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. అయితే వీటిలో కొన్నింటిని రాజీ మార్గం ద్వారా కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ రద్దు చేసుకున్నట్టు ప్రచారంలో ఉంది. ఒకే ప్లాట్‌ను ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది కొనుగోలు చేసి ఉదంతాలు కూడా ఉన్నాయంటున్నారు. కొన్ని వివాదాలు న్యాయస్థానం పరిధిలో ఉన్నట్టు సమాచారం. దీంతో ఈ సర్వే నెంబర్ల పరిధిలో ఉన్న భూములను రెవెన్యూ అధికారులు కొంతకాలం ఫ్రీజ్ చేశారు. దీనిపై ఆ ప్రాంత రైతులు ఉన్నతాధికారులను కలిసి తాము నష్టపోతున్నామని విన్నవించడంతో మొదటి డాక్యు మెంట్‌లో ఉన్నవారే అసలైన పత్రాలు కలిగి ఉన్న వారిగా గుర్తించి రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇచ్చారు. 60 ప్లాట్లు వివాదాల్లో ఉన్నాయంటే ఈ లే అవుట్‌లో రియల్ బ్రోకర్ల ప్రమేయం ఏ మేరకు ఉందో అర్థమవుతుంది. రాగోలు పరిధిలో ఉన్న దాదాపు అన్ని లే అవుట్స్‌లోనూ ఇదే పరిస్థితి ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ అక్రమాల్లో రిజిస్ట్రేషన్, రెవెన్యూ ఉద్యోగుల పాత్ర కూడా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# దివ్యాంగులకు అన్నివిధాల ఆదుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)



తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2వేలు ఉన్న పెన్షన్‌ను రూ.6వేలకు చంద్రబాబు పెంచారని గుర్తు చేసారు. దివ్యాంగులకు ఏదో ఒక కార్యక్రమం చేయాలన్న తపనతో గతంలో అనేక సందర్భాల్లో టెస్టింగ్ క్యాంప్స్ పెట్టి, వారికి ఏ పరికరాలు కావాలో తెలుసుకొని ఆ పరికరాలను శ్రీకాకుళంలో పంపిణీ చేశామని తెలిపారు. సుమారు 353 బ్యాటరీ ట్రైసైకిల్స్ ఈరోజు పంపిణీ చేయగలిగామని, భవిష్యత్తులో కూడా మరో కార్యక్రమం నిర్వహించి, సాచురేషన్ పంపిణీ చేస్తామని స్పష్టం చేసారు. ఈ సందర్భం గా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ యాక్టివిటీ చేసినందుకు ఛైర్మన్ విపిన్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ దివ్యాంగులు వారికి కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారి కోసం గ్రీవెన్స్ కేంద్రానికి ర్యాంపు వేయించామని వివరిం చారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఎంపీగా ఉన్నప్పుడు కూడా ఎంపీ నిధుల నుంచి, ఆలింకో సంస్థ నుంచి దివ్యాంగులకు పరికరాలు అందజేసారని, ఈ ఏడాదిలో మూడోసారి పరికరాల పంపిణీ చేపట్టడం గొప్ప విషయ మన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి మాట్లాడుతూ దివ్యాంగులకు అందించిన ట్రైసైకిల్స్ వినియోగించుకుని చిరువ్యాపారాలు చేసుకుంటూ లబ్ధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌర విమానయాన సంస్థ ఛైర్మన్ విపిన్ కుమార్, హెచ్ఆర్ మెంబర్ హెచ్. శ్రీనివాస్, జనరల్ మేనేజర్ సంజయ్ సింగ్, ఇండియా టర్న్స్ పింక్ సంస్థ ఫౌండర్ ఆనంద్ కుమార్, డీసీఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాష్, డిసిసిబి ఛైర్మన్ ఎస్.సూర్యం, వంశధార ఛైర్మన్ అరవింద్, రిటైర్డ్ ఆర్డీవో పిఎంజే బాబు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ మోహనరావు మృతి

మొదటిపేజీ తరువాయి

వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ నివాళి అర్పించి అంతిమ యాత్రలో పాల్గొని పాడి మోసి, మోహనరావుపై తనకున్న సన్నిహిత్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ టీడీపీ ఒక నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకు ళం రూరల్ మండలంలో టీడీపీకి బలమైన నాయ కుడిని కోల్పోయిందన్నారు. మోహనరావు ఎన్టీఆర్ అభిమానిగా టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహ రిస్తూ 2004లో సింగుపురం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత రెండోసారి సర్పంచ్‌గా గెలిచారు. 2004లో సింగుపురం ఉత్తమ గ్రామ పంచాయతీగా రాష్ట్రస్థాయిలో నిల బెట్టిన ఘనత మోహనరావుకే దక్కింది. 2019కు ముందు టీడీపీని వీడి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైకాపాలో చేరారు. ఆ తర్వాత కొన్ని రోజులకే వైకాపాలో ఇమడలేక తిరిగి టీడీపీలో చేరారు. ప్రస్తుతం నీటిసంఘం అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. మోహనరావు మరణవార్త విన్న టీడీపీ నియోజకవర్గ నాయ కులు, కార్యకర్తలు వివిధ రాజకీయ పార్టీల స్థానిక సంస్థల ప్రతినిధులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.